ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 వరంగల్
శనివారం 24 ఆగస్టు 2024

మామునూరు విమానాశ్రయంలో ఏఏఐ సర్వే విమానాలు (ఫైల్)



భూసేకరణే అడ్డు!



- ఇప్పటికే 700 ఎకరాల అప్పగింత.. మరో 300ఎకరాలు అవసరమని గుర్తించిన ఏఏఐ
- ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల రైతులతో అధికారుల చర్చలు
- భూమికి బదులు భూమి లేదా మార్కెట్ రేటు ఇవ్వాలంటున్న అన్నదాతలు
- నష్టపరిహారం చెల్లింపుపై స్పష్టత ఇవ్వని సర్కారు
- ఇప్పటికే మామునూరులో స్కై అండ్ ల్యాండ్ సర్వే పూర్తి
- 150 కిలోమీటర్ల నిబంధన సడలింపుపై 'జీఎంఆర్'తో ప్రభుత్వం చర్చలు

మామునూరు విమానాశ్రయానికి భూమి కోసం ప్రభుత్వం కసరత్తు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్ విమానాశ్రయానికి భూసేకరణే ప్రధాన అడ్డంకిగా మారుతోంది. ఇప్పటికే ఎయిర్‌పోర్టు కోసం 700ఎకరాల భూమిని అప్పగించగా, మరో 300ఎకరాల భూమిని కేటాయించాలని ఎయిర్‌పోర్టు అథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రభుత్వాన్ని కోరింది. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉన్న ప్రభుత్వం.. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. అయితే భూమికి బదులు భూమి ఇవ్వాలని లేదంటే బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరను చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.1కోటి నుంచి రూ.2కోట్లకు పైగా ధర ఉంది. దీంతో ప్రభుత్వం రైతులకు చెల్లించే నష్టపరిహారం విషయంలో స్పష్టత ఇవ్వకపోవటంతో ఎయిర్‌పోర్టుకు భూసేకరణ ప్రధాన అడ్డంకిగా మారిందనే చర్చ జరుగుతోంది.

ఎయిర్‌పోర్టుకు సర్వేలన్నీ అనుకూలమే..



2017 ఏప్రిల్ 27న ఉడే దేశ్‌కే ఆమ్ నాగరిక్ (ఉడాన్) పథకం కింద వరంగల్ ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఓఎల్ఎస్ సర్వే, సాయిల్ టెస్టింగ్‌తో పాటు వివిధ సర్వే సంస్థల నివేదికలతో పాటు టెక్నో ఎకనామికల్ ఫీజిబిలిటీ స్టడీ రిపోర్టును ఎయిర్‌పోర్టు అథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)పూర్తి చేసి గత 2023 జూలై 7వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. దీంతోపాటు మరోసారి గత ఏప్రిల్‌లో ఏఏఐ అధికారులు ఓఎల్ఎస్ సర్వేతో పాటు మట్టి పరీక్షలు నిర్వహించారు. మూడు విమానాలతో ఎయిర్ వ్యూ చేపట్టారు. విమానాల రాకపోకలకు వాతవారణం అనుకూలంగా ఉందా లేదా అని పరి శీలించారు. జియాజికల్ సర్వేతో పాటు స్కై అండ్ ల్యాండ్ సర్వే చేపట్టారు. సుమా రు రెండు వా రాల పాటు ఏఏఐ సిబ్బంది మామునూనులోనే మకాం వేసి ఎయిర్ పోర్టు నిర్వహణకు కావాల్సిన అన్ని టెస్టులను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించారు. ఇక హైదరాబాద్ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పందం మేరకు 150కి.మీ పరిధిలో 2038 వరకు మరో వాణిజ్య విమానాశ్రయం ఉండకూడదనే నిబంధన ఉంది. ఈ నిబంధన ప్రకారం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు మామునూరు 145కిలో మీటర్ల లోపే ఉంది. ఈ నిబంధనల సడలింపుపై ప్రభుత్వం అభ్యర్థన మేరకు జీఎంఆర్ నుంచి సానుకూలత వచ్చిందని సమాచారం.

అంతర్జాతీయ స్థాయి విమానాలకు అనుకూలంగా...

'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా మారింది వరంగల్ ఎయిన్ పోర్టు పరిస్థితి. అన్ని రకాల అనుమతులు, అనుకూలతలు ఉన్నప్పటికి ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ఏదో ఒక అడ్డంకి ఎదురవుతోంది. గత ప్రభుత్వం మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం ప్రయత్నాలు చేసింది. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కావాల్సిన మరో 438 ఎకరాల భూమితో పాటు రూ.1,200కోట్ల నిధులను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏఏఐ

మిగతా 7వ పేజీలో..

రైతులతో చర్చిస్తున్నాం..

రేవూరి ప్రకాష్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే



మామునూరు ఎయిర్‌పోర్టుకు కావాల్సిన భూమిని ఇచ్చేందుకు రైతులతో చర్చలు జరుపుతున్నాం. ఇప్పటికే సంగెం మండలంలోని పలు గ్రామాల్లో సభలు నిర్వహించాం. భూమికి బదులు భూమి కావాలని రైతులు కోరుతున్నారు. లేదంటే బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలని అడుగుతున్నారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే వరంగల్ వాసులకు గగనయానం సాకారం అవుతుందనే నమ్మకం ఉంది.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా మోదీ పాలన

- బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది
- దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయి
- సెప్టెంబరు 1 నుంచి 7వరకు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- హనుమకొండలో రెండో రోజూ సాగిన కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు

7



మాట్లాడుతున్న అంబర్ కిషోర్ ఝూ

మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యమివ్వండి

- ట్రై సిటీస్‌లో డ్రంకెన్ డ్రైవ్‌ను కట్టడి చేయాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

వరంగల్ క్రైం, ఆగస్టు 23 : మహిళలు, చిన్నారుల భద్రతకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. స్టేషన్‌లలోని పెండింగ్ కేసులు, కేసు ప్రస్తుత స్థితిగతులు, నిందితుల అరెస్టుకు గల కారణాలు కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు అధికారులు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ కింది స్థాయి సిబ్బంది పనితీరు పర్యవేక్షించాలన్నారు. మహిళలు, పిల్లలపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారు ఇచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తూ బాధితులకు న్యాయం చేయాలని కమిషనర్ సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలు గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ట్రై సిటీస్ పరిధిలో ట్రిపుల్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్ కట్టడి చేయాలన్నారు. సన్నిహిత నుంచి ప్రతి ఫిర్యాదును స్టేషన్ అధికారులు క్షేత్ర స్థాయిలో దర్యాప్తు చేపట్టి తగిన నివేదిక అందించాల్సి ఉంటుందని కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సెంట్రల్, వెస్ట్ జోన్ డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అదనపు డీసీపీలు రవి, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీతోనే వికసిత్ భారత్

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

గీసుగొండ, ఆగస్టు 23: బీజేపీతోనే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. ధర్మారంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన కుసుమ సతీష్ ఆధ్వర్యంలో సభ్యత్వనమోదు కార్యశాల జరిగింది. ముఖ్య అతిథి ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వగురువుగా దేశాన్ని చూడాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమన్నారు. ప్రధాని లక్ష్యసాధనకు ప్రజలు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అవినీతిరహిత పాలనతో దేశ ప్రజల అభిమానాన్ని బీజేపీ పొందుతుందన్నారు. గంట రవికుమార్ మాట్లాడుతూ... భారత ప్రజల సంక్షేమాన్ని కాంక్షించే బీజేపీకి ప్రజలందరూ అండగా ఉండాలన్నారు. పార్టీకి ప్రజల మద్దతును కోరేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడు సతీష్‌షా, నాయకులు ఎడ్ల అశోక్‌రెడ్డి, వన్నాల వెంకటరమణారెడ్డి, తిరుపతిరెడ్డి, హరిశంకర్, రాణాప్రతాప్‌రెడ్డి, గట్టికొప్పుల రాంబాబు, కంది క్రాంతికుమార్ పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయంలో భక్తుల సందడి

వరంగల్ కల్చరల్, ఆగస్టు 23: శ్రావణ శుక్రవారం కావడంతో భక్తులతో భద్రకాళి అమ్మవారి దేవాలయం రద్దీగా మారింది. ఉదయం నుంచి అమ్మవారికి నిత్యాహ్నికం నిత్యపూజ అనంతరం అమ్మవారిని అలంకరించారు. శ్రావణ శుక్రవారం కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులతో ప్రత్యేక క్యూలైన్లు నిండాయి. అమ్మవారికి ఒడి బియ్యం పోసి, చీరల సమర్పణ చేసుకున్నారు. అమ్మవారి ప్రసాదాలను విశాలంగా ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేయాలని, ప్రసాదం కోసం నిరీక్షించడం ఇబ్బందిగా ఉందని భక్తులు వాపోయారు.



భక్తులతో నిండిన ఆలయం

హత్యాచార ఘటనను నిరసిస్తూ ర్యాలీ

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 23: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ (జూడా)పై హత్యాచారం నిరసిస్తూ శుక్రవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న వరంగల్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థినులు మాట్లాడుతూ.. సమాజంలో మహిళలకు రక్షణ కల్పించాలని, లింగ సమానత్వం అలవర్చుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. నిందితులకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.



బల్దియా ఎదుట హార్టికల్చర్ కార్మికుల ధర్నా

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 23 : తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలనీ, చాలా సంవత్సరాలుగా గ్రేటర్ వరంగల్ హార్టికల్చర్ విభాగంలో దినసరి కూలీలుగా పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.15,500 అందించాలని శుక్రవారం కార్మికులు, సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. తమకు నెల వారీగా వచ్చే వేతనాలు సైతం మూడు మాసాలకు ఒక మారు వస్తున్నాయని, ప్రతీ నెల 5వ తేదీ వరకు వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అంతే కాకుండా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించడంతో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలని వారు అదనపు కమిషనర్ రవీందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.





బాధ్యతలు స్వీకరించిన డీఏవో

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 23: వరంగల్ జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏవో)గా శుక్రవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో కె.అనురాధ బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఏవోగా పనిచేసిన ఉషాదయాల్ ఆదిలాబాద్‌కు బదిలీ కాగా, ఆమె స్థానంలో భువనగిరి యాదాద్రి జిల్లా డీఏవోగా పనిచేస్తున్న అనురాధను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు వెలుబడిన విషయం తెలిసిందే. ఆమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఉద్యోగులు ఆమెకు అభినందనలు తెలిపారు.

విషజ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి

● ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో పనిచేయాలి ● భాంజిపేట పీహెచ్‌సీ తనిఖీలో కలెక్టర్ సత్యశారద

నర్సంపేట టౌన్, ఆగస్టు 23: విషజ్వరాలపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పనిచేయాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. నర్సంపేట మండలం భాంజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని ఫీవర్ సర్వే మందుల రికార్డులను తనిఖీ చేసి మలేరియా, డెంగీ, విషజ్వరాల వివరాలను తెలుసుకున్నారు. ఇదే గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మలేరియా, డెంగీ, విషజ్వరాలు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నాలుగు రోజులపాటు జ్వరాలు ఉన్నట్లయితే వారికి తప్పనిసరిగా పరీక్షలు చేయాలన్నారు. ఒకవేళ మలేరియా, డెంగీ, విషజ్వరాలతో సీరియస్‌గా ఉంటే ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేయాలని సూచించారు. ఇదే సమయంలో భాంజిపేటలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. శిబిరానికి వచ్చిన ప్రజ లను అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. కార్య క్రమంలో మెడికల్ ఆఫీసర్ అరుణ్‌చంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ సత్యశారద

అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ తనిఖీ

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ అన్నారు. భాంజిపేట పీహెచ్‌సీ తనిఖీ అనంతరం నర్సంపేట మండలం మహేశ్వరం గ్రామంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను శుక్రవారం కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు, పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ మహ్మద్ ఇషాక్‌అలీకి పలు అంశాలపై ఆదేశాలిచ్చారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత బాగానే ఉందని, ఇలానే కొనసాగించాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

జడ్పీ సీఈవో విద్యాలత

హసన్‌పర్తి, ఆగస్టు 23: మహాత్మా జ్యోతిబా పూలే బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన విద్యను అందించాలని జెడ్పీ సీఈవో విద్యాలత అన్నారు. మండలంలోని ఎల్లాపూర్‌లో గల తిమ్మాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలికల విద్యాలయాన్ని శుక్రవారం విద్యాలత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిస్థితిని, ఉపాధ్యాయుల పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, డైనింగ్ హాల్, స్టాక్ రూం, రన్నింగ్, ఆర్‌వో వాటర్, టాయిలెట్స్‌తో పాటు ఇతర వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా పనిచేసి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమస్యలు వచ్చినప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులను సమన్వయం చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు మెరుగైన వసతులను సమకూర్చేందుకు సహకంరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులున్నారు.


డైనింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో విద్యాలత

ప్రేమపెళ్లి చేసుకుని ముఖం చాటేశాడు

భర్త, ఆరుగురిపై కేసు నమోదు

భీమదేవరపల్లి, ఆగస్టు 23: మండలంలోని ముల్కనూర్‌లో ప్రేమ వివాహం చేసుకొని ముఖం చాటేసిన భర్తతో పాటు వారి కుటుంబ సభ్యులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రికి చెందిన ఉడిపి చంద్రకళను మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన బొల్లంపల్లి రంజిత్ 2018లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. చంద్రకళతో రంజిత్ సుమారు ఏడేళ్లు సహజీవనం చేశాడు. గత నెల జూలై 29న తన ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన రంజిత్.. భార్య చంద్రకళ వద్దకు రావడం లేదు. దీంతో అనుమానం వచ్చిన చంద్రకళ ముల్కనూర్‌లోని అత్తాగారి ఇంటికి వచ్చి తన భర్త రంజిత్ కోసం వాకప్ చేసింది. రూ. 50 లక్షల కట్నం ఇవ్వాలని చంద్రకళను భర్త రంజిత్, అత్తామామలు రామచంద్రం- కనకలక్ష్మి, ఆడబిడ్డలు రమాదేవి, ధనలక్ష్మిలు బెదిరిస్తున్నారు. దీంతో చంద్రకళ పోలీసులకు ఫిర్యాదు చేయగా, భర్త రంజిత్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు రామచంద్రం, కనకలక్ష్మి, బొల్లంపలి రాజు, రమాదేవి, ధనలక్ష్మిలపై కేసు నమోదు చేసినట్లు ముల్కనూర్ పోలీసులు తెలిపారు. రంజిత్ పరారీలో ఉన్నాడు.

రికార్డుల్లో ఎక్కువ..

హాస్టల్‌లో ఉన్న విద్యార్థుల సంఖ్య తక్కువ

అధికారుల తనిఖీలో గుట్టు రట్టు

ఆత్మకూరు, ఆగస్టు 23: హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నా.. రికార్డులో మాత్రం విద్యార్థుల సంఖ్యను ఎక్కువగా చూపిస్తున్న విషయం అధికారుల తనిఖీల్లో బయటపడింది. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో ఎస్సీ బీసీ రెండు హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో 43 మంది విద్యార్థులు ఉన్నట్లు రికార్డుల్లో పేర్లు ఉన్నాయి కానీ రెండు హాస్టల్‌లో కేవల 17 మంది విద్యార్థులు ఉన్నారని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, నాయిని జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్య ఆదేశానుసారం రెండు హాస్టల్‌లను ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, ఆర్ఐ రవీందర్‌రావు ఆకస్మిక తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థులకు సరైన వసతులు లేకపోవడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా లేని విషయాలను గుర్తించారు. ఈ విషయాలను జిల్లా కలెక్టర్ కు నివేదికను సమర్పిస్తామన్నారు. సరైన వసతి లేకపోవడంతో విద్యార్థులు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లిపోతున్నట్లు విద్యార్థులు తెలిపారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

'అడ్డగోలు రిజిస్ట్రేషన్ల'పై
విజిలెన్స్ ఆరా

- రంగంలోకి అధికారులు.. వెలుగులోకి మరిన్ని అక్రమాలు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో ప్రకంపనలు



రాంనగర్, ఆగస్టు 23 : వరంగల్ రూరల్, ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'నిబంధనలు మరిచి అడ్డగోలు రిజిస్ట్రేషన్లు' చేశారన్న అంశంపై విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనం రిజిస్ట్రేషన్ శాఖలో తీవ్ర ప్రకంపనలు రేపింది. ఈ రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు జిల్లాలోని మిగిలిన కార్యాలయాల్లో పరిస్థితంతా గప్‌చుప్‌గా మారినట్టు తెలిసింది. ఇటీవల బదిలీపై వచ్చిన ఉద్యోగులు భయం భయంగా విధులు నిర్వహించినట్టు సమాచారం. ఎవరితో మాట్లాడితే ఏమవుతుందో అనే అనుమానంతో మౌనంగానే విధులు నిర్వహించి వెళ్లినట్టు తెలిసింది. కాగా బదిలీపై వెళ్లిన ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు నిబంధనలు విస్మరించి నాన్ లేఅవుట్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి అందినకాడికి దండుకున్నారనే విషయమై విజిలెన్స్ అధికారులు ఆరా తీసినట్టు సమాచారం. రెండు కార్యాలయాల్లో గత ఆరు నెలల్లో జరిగిన ఆస్తుల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వివరాలు సేకరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. సోమవారం రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

వెలుగులోకి మరిన్ని అక్రమాలు

కాగా వరంగల్ రూరల్, ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు పరకాల, మహబూబాబాద్, ములుగు కార్యాలయాల్లో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు తెలిసింది. నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లతో పాటు పహాణీలతో రిజిస్ట్రేషన్లు చేసినట్టు తెలిసింది. పూర్వీకులు అమ్ముకున్న స్థలాలను కుటుంబ సభ్యులు విక్రయించడం లాంటి రిజిస్ట్రేషన్లు చేశారని, వరంగల్ రూరల్ కార్యాలయంలో కొద్దిరోజులు ఇన్‌చార్జ్‌గా బాధ్యతల్లో ఉన్న ఒక అధికారి వరంగల్ ప్రాంతంలో అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని సమాచారం. ఈ అధికారి నిబంధనలు తుంగలో తొక్కి పహాణీలతో రిజిస్ట్రేషన్లు చేశాడనే ఆరోపణలున్నాయి. పరకాలలో కూడా నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు, పార్ట్ రిజిస్ట్రేషన్లు భారీగానే జరిగినట్లు తెలిసింది. ఈ దందాలో పెద్ద మొత్తంలో కాసులు చేతులు మారినట్టు తెలుస్తుండగా ఇటీవల ఏసీబీకి పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ హయంలో జరిగిన రిజిస్ట్రేషన్లు పరిశీలిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశమున్నట్టు చర్చ జరుగుతోంది. ఇక మహబూబాబాద్, ములుగు కార్యాలయాల పరిధిలో నాన్ లేఅవుట్ వెంచర్లకు సంబంధించిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లు పెద్ద ఎత్తున జరిగినట్లు తెలుస్తుండగా గతేడాది కాలంగా ఈ దందా విచ్చలవిడిగా జరిగినట్టు సమాచారం. అధికారులు వరంగల్ రూరల్, ఖిలా వరంగల్, పరకాల, మహబూబాబాద్, ములుగు కార్యాలయాల్లోని రికార్డులు పరిశీలిస్తే మరిన్ని అక్రమ రిజిస్ట్రేషన్ల బాగోతం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

మార్కెట్‌కు మూడు
రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 23: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం యార్డు బంద్, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సెలవు ప్రకటించినట్లు కార్యదర్శి ఆ ప్రకటనలో తెలిపారు. మంగళవారం మార్కెట్లో క్రయవిక్రయాలు యథావిధిగా నిర్వహించబడుతాయని, రైతులు, వ్యాపారులు, కార్మికులు గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు.

మెట్టుగుట్ట ఆలయ
అర్చకుడిపై ఫిర్యాదులు

విచారణ చేపట్టిన డిప్యూటీ కమిషనర్?

వరంగల్ కల్చరల్, ఆగస్టు 23 : మడికొండ మెట్టుగుట్టలోని మెట్టు రామలింగేశ్వర దేవాలయం ఆలయ అర్చకుడిని శుక్రవారం జిల్లా సహాయ కమిషనర్ రాయల సునీతతో కలిసి ఆలయానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు సమాచారం. డబ్బులు వసూలు చేయడమేకాక, డబ్బున్న వారికే ప్రాధాన్యమిస్తున్నారంటూ భక్తులు దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావుకు అర్చకుడు అభిలాష్‌శర్మపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఆలయానికి చేరుకొని దేవాదాయ శాఖ ఆలయ క్లర్క్ భాస్కర్‌పై కూడా ఆరోపణలు ఉన్న నేపథ్యంలో డీసీ భక్తులను అర్చకుడిని, క్లర్క్‌ను విచారించినట్లు తెలిసింది.



మున్షాన్‌పల్లి పాఠశాలను శుభ్రం చేస్తున్న పార్ట్‌టైం స్వీపర్ పర్శరాములు

కొలువులకు.. భద్రతేదీ?

- ఆర్థిక ఇబ్బందులతో పార్ట్‌టైం స్వీపర్లు
- పర్మినెంట్ చేస్తారని 30ఏళ్లుగా ఎదురుచూపు
- హైపవర్ కమిటీ వేసినా ఫలితం శూన్యం
- ఏపీలో పాతికేళ్ల క్రితమే క్రమబద్ధీకరణ
- తెలంగాణలో ఇప్పటివరకు అతీగతీ లేదు

బచ్చన్నపేట, ఆగస్టు 23: మంచి రోజులు రాకపోతాయా.. దశ మారకపోతుందా.. అని పార్ట్ టైమ్ స్వీపర్లు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందుతామని, కనీస వేతనం అందుతుందని 30 ఏళ్లకు పైగా చాకిరీ చేస్తున్నారు. చాలీచాలని జీతంతో ఇబ్బందులు పడుతూ బతుకుబండిని నెట్టుకొస్తున్నారు. రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో దశాబ్ధాలుగా పని చేస్తున్న పార్ట్‌టైం స్వీపర్ల దుస్థితి ఇది. వీరిలో ఇప్పటికే అనేక మంది మృతి చెందగా, కొందరు రిటైర్ అయ్యారు. 1983లో పార్ట్‌టైం స్వీపర్లుగా ఆంధ్ర, తెలంగాణాలో ఒకేసారి నియామకం అయినప్పటికీ 1994లో అక్కడి వారిని పర్మినెంట్ చేశారు. కాని తెలంగాణలో ఇప్పటి వరకు మోక్షం కలగలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు బాగుపడతాయని ఆశించినప్పటికీ వారికి నిరాశే ఎదురైంది. మొదట్లో వీరికి నెలకు రూ. 150 జీతం వచ్చేది. అతి తక్కువ జీతమైనప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో కొలువు అన్న భావనతో పని చేస్తున్నారు. పర్మినెంట్ అయితే జీతం పెరుగుతుందని ఆశతో జీవిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 500 మంది ప్రస్తుతం పనిచేస్తున్నారని సంఘం నేతలు చెబుతున్నారు. వారిలో జనగామ జిల్లా నుంచి 35 మంది ఉన్నారు.

హైపవర్ కమిటీ వేసినా ఉపయోగం లేదు..

వేతనాలు పెంచాలని, పర్మినెంట్ చేయాలని పార్ట్‌టైం స్వీపర్లు చేసిన ఆందోళనలతో 1992లో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి వారిని పర్మినెంట్ చేసేందుకు హైపవర్ కమిటీ వేశారు. ఏవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కమిటీ స్వీపర్ల క్రమబద్ధీకరణకు అనుకూలంగా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. వీరి వేతనాన్ని స్థిరీకరించి టైమ్ స్కేల్ ఇవ్వాలని ఆదేశించింది. కాని, ఈ ఉత్తర్వులు అమలు కాకపోవటంతో హైకోర్టుకు వెళ్లారు. దీంతో ఈ విషయంలో ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీవోఎంఎస్ నెం.212 ద్వారా 1994 ఏప్రిల్ 22న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో స్వీపర్లు ఇక తమ కష్టాలు గట్టెక్కినట్టేనని సంబరాలు చేసుకున్నారు. కాని ఆంధ్ర ప్రాంతంలో పని చేసిన అధికారులు అక్కడ పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్లను పర్మినెంట్ చేశారు. వారు ప్రస్తుతం రూ.20 వేల జీతం పొందుతున్నారు. కానీ తెలంగాణలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. తర్వాత తమ సమస్యలు పరిష్కరించాలని 2007లో చలో సీఎం కార్యక్రమం నిర్వహించి అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఎదుట తమ గోడును వెళ్లబోసుకున్నారు. అయినా స్పందన లేకపోవడంతో మానవ హక్కుల సంఘాన్ని సైతం ఆశ్రయించారు. దీంతో వారికి అనుకూలంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, ఆర్థిక శాఖల అధికారులను సంఘం ఆదేశించింది. వీరి వివరాలు తెప్పించుకున్న అధికారులు అంతటితోనే చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం నెలకు రూ. 5200 ల వేతనంతో జీవితం గడుపుతున్నారు. పార్ట్ టైం స్వీపర్లు పనిచేస్తున్న పాఠశాలల హెచ్‌ఎంలు అటెండెన్స్ పత్రాలను ఎంపీడీవోకు ప్రతీనెల పంపిస్తే వారు బిల్లులు చేసి ఎస్‌టీవోకు పంపుతారు. మూడు మాసాలు, ఆరు మాసాలకోమారు జిల్లా పరిషత్ నుంచి వచ్చే కాంటిన్‌జెన్సీ నిధులు జమచేస్తే వీరికి జీతాలు ఖాతాల్లో పడుతాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తమ బాధను అర్థం చేసుకుని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు అమలు చేయాలని స్వీపర్లు కోరుతున్నారు.

ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలి

- గూడముల అయోధ్య, పార్ట్‌టైం స్వీపర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



తెలంగాణ రాష్ట్రం వచ్చాక మా బతుకులు మారుతాయనుకున్నాం. కాని, మమ్మల్ని పర్మినెంట్ చేయటంలో కేసీఆర్ ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. 1983 నుంచి అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రస్తుతం పనిచేస్తున్నావారిని పర్మినెంట్ చేయడంతో పాటు మృతి చెందిన వారి కుటుంబాలకు, రిటైర్ అయిన వారి కుటుంబాలకు ఉపాధి కల్పించి ఆదుకోవాలి.

కట్కూరు బడిలో 35 ఏళ్లు పనిచేశా..

- బాలమల్లయ్య, రిటైర్డ్ పార్ట్‌టైం స్వీపర్, కట్కూరు



కట్కూరు ప్రైమరీ పాఠశాలలో 35 ఏళ్లు పనిచేశా. ప్రారంభంలో రూ. 150 జీతం ఇచ్చేవారు. రిటైర్‌మెంట్ సమయానికి రూ. 4 వేలు చేశారు. ఉద్యోగంలో చేరే సమయంలో కొద్ది రోజుల్లోనే పర్మినెంట్ చేస్తామన్నారు. ఇప్పటి వరకు అమలు చేయలేదు. అనేక సార్లు ఆందోళనలు చేశాం. కోర్టుకు వెళ్లాం. అయినా మా బతుకులు మారలేదు. మంచి రోజులు రాకపోతాయా అని ఎదురు చూస్తూ మా జీవితాలను బజారున పడేసుకున్నాం. ప్రస్తుతం పనిచేస్తున్న వారికైనా ప్రభుత్వం న్యాయం చేయాలి.

సీఆర్‌పీఎఫ్ వాహనం నుంచి
కిందపడ్డ కార్బన్ వెపన్

- ఆయుధాన్ని పోలీస్ స్టేషన్‌లో అందజేసిన ఆటోడ్రైవర్
- సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి గన్‌ను అప్పగించిన పోలీసులు

మట్టెవాడ, ఆగస్టు 23: వరంగల్ ఎంజీఎం జంక్షన్ సమీపంలో సీఆర్‌పీఎఫ్ ట్రక్ వాహనం నుంచి కార్బన్ వెపన్ ఎంజీఎం జంక్షన్ సమీపంలో కిందపడిపోయింది. అదే సమయంలో అటు వైపు నుంచి వస్తున్న ఆటో డ్రైవర్ గమనించి ఆ ఆయుధాన్ని మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో అప్పగించిన ఘటన వరంగల్‌లో చోటు చేసుకుంది. వరంగల్ మట్టెవాడ సీఐ గోపి కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో భీమారంలోని సీఆర్‌పీఎఫ్ బెటాయిన్ మణిపూర్‌కు వెళ్లేందుకు ప్రత్యేక వాహనాల్లో సిబ్బందితోపాటు ఆయుధాలను వరంగల్ రైల్వేస్టేషన్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో వాహనం నుంచి సీలింగ్ ఊడిపోయి కార్బన్ వెపన్ కింద పడిపోయింది. అదే సమయంలో పైడిపల్లికి చెందిన ధరావత్ శ్రీను ఆటో నడుపుకుంటూ వెళ్తుండగా, ఓ షోరూం ఎదురుగా ఉన్న రోడ్డుపై ఆయుధం ఉండడానిన గుర్తించాడు. వెంటనే అతడు మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ ధర్మనాయక్‌కు అప్పగించారు.

కొంత సమయం తర్వాత సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వెపన్ వెతుకుతున్న క్రమంలో స్టేషన్‌లో అప్పగించినట్లు తెలుసుకున్నారు. దీంతో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ రాజేష్‌కుమార్ పోలీసు స్టేషన్‌కు చేరుకొని విషయం వెల్లడించగా వారు ఆయుధాన్ని అప్పగించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీరకం)	2711	2572
పల్లికాయ(పచ్చిది)	3900	3200
పల్లికాయ(సూక)	5900	5000
పెసర	5855	5155
పత్తి	7410	5000
పసుపు(కాడి)	12223	12223
పసుపు(గోల)	12226	12226
తేజ మిర్చి	12000	8500
తేజ ఏసీ	18000	15000
వండర్‌హాట్ ఏసీ	14800	11000
యూఎస్341 ఏసీ	14500	11000
తాలు మిర్చి	6000	3000

రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా మోదీ పాలన

- బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది
- విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శులు నారాయణ
- హనుమకొండలో రెండో రోజూ సాగిన కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు



వయనాడ్ బాధితుల కోసం డి.రాజాకు చెక్కు అందిస్తున్న నాయకులు

బాలసముద్రం, ఆగస్టు 23 : నరేంద్రమోదీ ఎన్నికల్లో గెలిచినా నైతికంగా ఓడిపోయారని, ఆయన పాలన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా సాగుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. హనుమకొండలోని హరితకాకతీయ హోటల్‌లో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు. 'దేశంలోని మహిళలకు న్యాయం చేస్తాం.. సబ్ కే సాత్.. సబ్ వికాస్' అని ప్రకటించిన మోదీ ప్రభుత్వం తమ నినాదాన్ని మార్చుకుని తమతో ఎవరుంటే.. వారితో తాముంటాం అనే కొత్త నినాదాన్ని అమలు చేస్తోందని ఆరోపించారు. దేశంలో మహిళలకు రక్షణ లేదని, వివిధ రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని విమర్శించారు. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలలో కేంద్రం ద్వారా నామినేట్ చేయబడిన గవర్నర్లతో రాజ్యాంగ, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగుతోందని, ఏపీ సీఎం చంద్రబాబు, నితీష్‌కుమార్ మద్దతు ఇవ్వకుంటే కేంద్ర ప్రభుత్వం పడిపోతుందన్నారు. దేశంలో సీబీఐ సంస్థ అత్యంత పవర్‌ఫుల్ సంస్థ అని ఆ సంస్థ అదానీ చేతిలోకి వెళ్లిందని విమర్శించారు. దేశంలోని బీజేపీ వ్యతిరేక పార్టీలు అధికారంలో ఉన్న తమిళనాడు, కేరళ, ఢిల్లీ, కర్నాటక సీఎంలను సీబీఐ సంస్థలతో ఇబ్బందులుకు గురి చేసిందన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మధ్య దూరం పెరిగిందని, ప్రధాని మోదీ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు జాతీయ స్థాయిలో ఉన్న ఇమేజ్‌ను వాడుకుని దేశంలో రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన చేస్తున్నారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, అమరావతికి రూ.వేల కోట్ల నిధులు ప్రపంచ బ్యాంకుల నుంచి అప్పులు ఇప్పించి మోదీ చంద్రబాబును పావుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ తీర్పును సీపీఐ స్వాగతిస్తున్నట్లు నారాయణ తెలిపారు. వర్గీకరణకు క్రీమీలేయర్‌కు సంబంధంలేదని, రాష్ట్రంలో ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే బీజేపీలో బీఆర్‌ఎస్ విలీన మవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతుండగా, రేవంత్ బీజేపీలో చేరుతారని బీఆర్‌ఎస్ నాయకులు అంటున్నారన్నారు. రెండు పార్టీ లు రాజకీయ క్రీడ ఆడుతున్నారని, ప్రజలకు కావాల్సింది, అభివృద్ధి, సంక్షేమం అని నారాయణ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలన సరిగ్గా చేసుకోవాలని హితవు పలికారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపో యాయని ధరల నియంత్రణ డిమాం డ్ చేస్తూ సెప్టెంబరు 1 నుంచి 7వరకు సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నామని, ఈ ప్రజా పోరాటాలలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ, సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా మాట్లాడుతూ ప్రజలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకువచ్చిందని, ప్రజలకు, ప్రజాస్వామిక వాదులతో చర్చించకుండా ఇటీవల న్యాయ చట్టాలు రూపొందిం చిందన్నారు. దేశంలో విద్యా, వైద్యం పేద ప్రజలకు అందడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, పల్లా వెంకటరెడ్డి, పశ్యపద్మా, కలవేణ శంకర్, ఎం. బాలనరసింహా, బి. విజయసారథి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వయనాడు బాధితులకు సీపీఐ తెలం గాణ సమితి నుంచి రూ.5.41లక్షల ఆర్థిక సహాయాన్ని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అందించారు.



మాట్లాడుతున్న ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్, చైర్మన్ కరుణాకర్‌రెడ్డి

ఏకశిల ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి
శస్త్ర చికిత్స విజయవంతం

వరంగల్ మెడికల్, ఆగస్టు 23 : తెలంగాణలో (హైదరాబాద్ మినహా) తొలి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సను హనుమకొండలోని ఏకశిల ఆస్పత్రిలో విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్, చైర్మన్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఏకశిల హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో శస్త్ర చికిత్సకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాయపర్తి గ్రామానికి చెందిన గాదె విజయ్ కుమార్ గత ఏడు సంవత్సరాలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా డయాలసిస్‌పై ఉండగా హాస్పిటల్‌లోని నెఫ్రాలజిస్టు డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ నవీన్ కుమార్‌ల సూచన మేరకు డయాలసిస్ టెక్నికల్ మేనేజర్ రమేశ్ ప్రోద్బలంతో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. పేషంట్ భార్య ఉమాదేవి కిడ్నీని దానం చేసింది. ఈ క్రమంలో భార్యాభర్తలిద్దరిని వైద్య బృందం సునిశితంగా పరీక్షించి శస్త్ర చికిత్సకు వెళ్లవచ్చని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ శస్త్ర చికిత్సలో ట్రాన్స్‌ప్లాంట్ యూరాలజిస్టు డాక్టర్ ఎస్.జయరాంరెడ్డి, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి, డాక్టర్ శివకుమార్, నెఫ్రాలజిస్టు డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ నవీన్‌కుమార్, అనస్థీషియా డాక్టర్ వి.రమేశ్‌ల ఆధ్వ ర్యంలో ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా చేసినట్లు తెలిపారు. శస్త్ర చికిత్స అనంతరం పేషంట్‌తోపాటు కిడ్నీ దాత ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నట్లు వివరిం చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, డాక్టర్లు, వైద్య బృందం, హాస్పిటల్ ఆర్ఎంవో డాక్టర్ వెంకట్‌రెడ్డి, జనరల్ మేనేజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కొడుకు మృతి..

- తట్టుకోలేక ఆగిన సవతితల్లి గుండె
- మహబూబాబాద్‌లో విషాద ఘటన

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 23 : తన కడుపున పుట్టకపోయినా.. కన్నవారితో సమానంగా ఆ కుమారుడిని సాకింది ఆ తల్లి. సవతితల్లి అనే మాటే కానీ పిల్లలను పెంచే విషయంలో ఎక్కడా సొంత తల్లి లేని లోటును కనిపించకుండా పెంచి పోషించింది. అలాంటి ఆ తల్లి అనారోగ్యంతో మృతి చెందిన కుమారుడి మృతదేహంపై పడి రోదిస్తూ ప్రాణాలొదిలిన విషాద సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు శనిగపురంలో శుక్రవారం జరిగింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.

శనిగపురం గ్రామానికి చెందిన మంద వెంకన్న రైల్వే ట్రాక్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వెంకన్న భార్య స్వరూప 30 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటికే వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. భార్య చనిపోవడంతో వెంకన్న పిల్లల ఆలనాపాలన కోసం చిన్న గూడూరు మండలం జయ్యారానికి చెందిన జ్యోతి (50)ని రెండో వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత జ్యోతి ఆ ముగ్గురు పిల్లల బాగోగులు చూసుకునేది. ఈ క్రమంలోనే వెంకన్న, జ్యోతికి ఓ కుమారుడు, కుమార్తెకు జన్మించారు. అయినప్పటికి జ్యోతి ఐదుగురు పిల్లలను తారతమ్యం లేకుండా పెంచి పెద్ద చేసింది. మొత్తం ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులకు వివాహాలు చేసింది. ఏడాది క్రితం వెంకన్న కూడా చనిపోవడంతో జ్యోతి ఖమ్మంలోని తన కూతురు వద్ద ఉంటోంది. ఈ క్రమంలో వెంకన్న మొదటి భార్య కుమారుడు రవి (32) శనిగపురంలో ఆటో నడుపుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కానీ, ఇటీవల కాలంలో మద్యానికి బానిసైన రవి తరచూ గొడవపడటంతో అతడి భార్య స్వప్న నాలుగు నెలల క్రితం నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామంలోని తన తల్లిగారింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయిన రవి అనారోగ్యం పాలై గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులు ఖమ్మంలో ఉన్న సవతితల్లి జ్యోతికి సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం శనిగపురం చేరుకున్న జ్యోతి రవి మృతదేహంపై పడి గుండెలవిసేలా రోదించింది. ఈ క్రమంలోనే గుండెపోటుకు గురై కొడుకు మృతదేహంపైనే అపస్మారక స్థితిలో పడిపోవడంతో కుటుంబసభ్యులు స్థానిక వైద్యుడికి చూపించారు. అయితే అప్పటికే జ్యోతి మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం కుటుంబసభ్యులు రవి అంత్యక్రియలను నిర్వహించి.. జ్యోతి మృతదేహాన్ని ఆమె పుట్టినిల్లయిన చిన్న గూడూరు మండలం జయ్యారానికి తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు రవికి భార్య స్వప్న, నాలుగేళ్ల కుమారుడు నవనీత్‌కుమార్ ఉండగా.. నాలుగేళ్ల నవనీత్ కుమార్ తండ్రికి తలకొరివి పెట్టడం చూసి స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇక తనకు పుట్టక పోయినా చిన్నప్పటి నుంచి ప్రేమగా పెంచి పోసించిన కుమారుడు ఇలా చనిపోవడాన్ని జీర్ణించుకోలేకపోయిన జ్యోతి అతడి మృతదేహంపై పడి మృతి చెందడం తమను కలిచివేసిందని కుటుంబసభ్యులు, గ్రామస్థులు చెబుతున్నారు.



మంద రవి (ఫైల్)



జ్యోతి (ఫైల్)



రమేష్ అంతిమసంస్కారాలు నిర్వహిస్తున్న చిన్నారి నవనీత్

భూసేకరణే అడ్డు!

5వ పేజీ తరువాయి

కోరింది. అయితే గత ప్రభుత్వం రూ.520కోట్ల నిధులతో పాటు 253 ఎకరాల భూమిని కేటాయించేందుకు ముందుకు వచ్చింది. దీనికి సంబంధించి 2023 ఆగస్టు నెలలో జీవో ఎంఎస్ నెం.36ని జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను ఏఏఐ పరిగణనలోకి తీసుకోకపోవటం, భూసేకరణ, నిధులు విడుదల చేయటంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విమానాశ్రయం పనులు 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అనే చందంగా మారింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మామునూరు ఎయిర్‌పోర్టుపై దృష్టి పెట్టింది. దీంతో రంగంలోకి దిగిన ఏఏఐ అధికారులు మామునూరులో ఉన్న పాత 1.8కి.మీ రన్‌వేను పరిశీలించారు. అంతర్జాతీయ స్థాయిలో విమానాలు నడిపించేందుకు అనుకూలంగా ఉండేలా ప్రస్తుతం ఉన్న 1.8కి.మీల రన్‌వేను 3.9కి.మీలకు పెంచాలని ఏఏఐ అధికారులు సూచించారు. ఇప్పటికే పైలట్, సిబ్బంది, టెర్మినల్స్‌తో పాటు సుమారు 694ఎకరాల వరకు భూమి ఉంది. కనీసం మరో 306 ఎకరాల భూమిని కేటాయిస్తే పెద్ద విమానాలు నడిపించేలా రన్‌వేను నిర్మించవచ్చునని ఏఏఐ అధికారులు ప్రభుత్వానికి సూచించారు. వరంగల్ ఎయిర్‌పోర్టుకు అంతర్జాతీయ స్థాయిలో విమానాలను నడిపించేందుకు కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నట్లుగా అధికారులు నిర్ధారించినట్లుగా సమాచారం.

భూసేకరణే ప్రధాన అడ్డంకి..

వరంగల్ ఎయిర్‌పోర్టుకు ప్రధానంగా భూసేకరణే అడ్డంకిగా మారుతోంది. నిజాం కాలంలో 1,875ఎకరాల భూమిని ఎయిర్‌పోర్టు కోసం కేటాయించారు. అయితే ప్రస్తుతం ఇందులో నుంచి జవహర్ నవోదయ విద్యాలయానికి 23.20ఎకరాలు, పోలీస్ శిక్షణ కళాశాలకు 59ఎకరాలు, ఏసీపీ కార్యాలయానికి 10ఎకరాలు, వరంగల్ సెంట్రల్ జైలుకు 101ఎకరాలు, ఫోర్త్ బెటాలియన్‌కు 241.24ఎకరాలు, మరో 675 ఎకరాల భూమిని వెటర్నరీ యూనివర్సిటీకి కేటాయించారు. రోడ్లు, ఇతర వాటికి పోగా ప్రస్తుతం 696ఎకరాల స్థలం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉంది. అయితే ఎయిర్‌పోర్టుకు 1,200ఎకరాల భూమి అవసరం కాగా, కనీసం వెయ్యి ఎకరాల భూమి అయినా ఇవ్వాలని కేంద్ర విమానాయశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇంకా 304ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. జూన్ 29న వరంగల్ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణంపై అధికారులతో చర్చించారు. ఏఏఐ అధికారులతో ప్రభుత్వం జరిపిన చర్చల మేరకు త్వరగా ఎయిర్‌పోర్టుకు భూమి కేటాయించాలని రెవెన్యూ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీంతో వరంగల్ జిల్లా కలెక్టర్‌తో పాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో సంగెం మండలంలోని గుంటూరుపల్లి, నక్కలపల్లి, గడపల్లి, మామునూరు గ్రామాల్లో భూసేకరణ కోసం గ్రామసభలు నిర్వహించారు. ఎయిర్‌పోర్టుకు కావాల్సిన భూమిని రైతుల నుంచి 259ఎకరాల వరకు సేకరించాలని నిర్ణయించారు. అయితే ఎయిర్‌పోర్టుకు భూములు ఇచ్చేందుకు రైతులు సానుకూలంగానే ఉన్నారు. కానీ, తమకు భూమికి బదులుగా మరో చోట భూమి కావాలని పట్టుబడుతున్నారు. వెటర్నరీ కాలేజీలో అదనంగా ఉన్న సుమారు 60ఎకరాల భూమిని రైతులు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్చలు జరిపింది. అయితే ఆ భూమి సాగుకు అనుకూలంగా లేని చౌడు నేల కావటంతో రైతులు విముఖత చూపుతున్నట్లుగా సమాచారం. ప్రత్నామ్నాయంగా భూమి లేకపోవటంతో నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఎకరానికి రూ.80లక్షలు చెల్లించేందుకు రైతులతో అనధికారికంగా చర్చలు జరిపారు. తమ భూములకు ప్రభుత్వం ధర కాకుండా బహిరంగ మార్కెట్‌లో ధరను చెల్లించాలని రైతులు పట్టుబడుతున్నారు. ఎయిర్‌పోర్టు వస్తుండటంతో ఈ ప్రాంతంలో ఎకరాకు రూ.1.50కోట్ల నుంచి రూ.2కోట్లకు పైగా ధర పలుకుతోందని, ఆ ధరనే తమకు చెల్లించాలని రైతులు పట్టుబడుతున్నారు. దీంతో 259ఎకరాలకు రూ.388.5కోట్ల నుంచి రూ.518కోట్లు నష్టపరిహారం కిందనే చెల్లించాల్సి వస్తుంది. ఇంత పెద్దమొత్తంలో రైతులకు నష్టపరిహారం ఇవ్వడం కుదరదని అధికారులు పేర్కొంటున్నారు. నష్టపరిహారంపై రైతుల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. అయితే ప్రభుత్వం నుంచి రైతులకు చెల్లించే నష్టపరిహారంపై ఎలాంటి స్పష్టత రాకపోవటంతో ఎయిర్‌పోర్టు పనులకు ఆటకం ఎదురవుతోంది. రైతుల నుంచి 259 ఎకరాలతో పాటు వెటర్నరీ కాలేజీకి చెందిన 40 ఎకరాల భూమి కూడా కలుపుకుని సుమారు 299 ఎకరాల భూమిని ఏఏఐకి కేటాయించాలని అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దీంతో ఏఏఐ కావాల్సిన సుమారు వెయ్యి ఎకరాల భూమి కేటాయింపు పూర్తి అవుతుందని భావిస్తున్నారు.

ఎకరాకు రూ.2కోట్ల పరిహారం ఇవ్వాలి

- దండ నరేష్, గుంటూరుపల్లి, సంగెం మండలం, వరంగల్ జిల్లా



ఎయిర్‌పోర్టు కోసం భూములు ఇచ్చేందుకు అభ్యంతరం లేదు. కానీ, ఎయిర్‌పోర్టు కోసం భూములను త్యాగం చేస్తున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. బహిరంగ మార్కెట్‌లో ఈ ప్రాంతంలో ఎకరాకు రూ.2కోట్ల వరకు ధరలు ఉన్నాయి. అవే ధరలను భూములు కోల్పోతున్న రైతులకు చెల్లించాలి. అలాగే రైతు కుటుంబంలోని అర్హతలను బట్టి ఎయిర్‌పోర్టు ఉద్యోగావకాశాలు కల్పించాలి.



ఆంధ్రజ్యోతి WARANGAL CITY 8
వరంగల్ సిటీ
వరంగల్ ● ఖిలావరంగల్ ● గీసుగొండ
శనివారం 24 ఆగస్టు 2024

కలెక్టర్‌ను కలిసిన మార్కెట్ ఎంప్లాయీస్ యూనియన్

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 23: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల ఆధ్వర్యంలో రాష్ట్ర మార్కెట్ కమిటీ ఎంప్లాయీస్ యూనియన్ కలెక్టర్ సత్యశారదను మార్యదపూర్వకంగా కలిశారు. శుక్రవారం యూనియన్ అధ్యక్షుడు చిలుకా నర్సింహరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండి.ముక్రం ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జన్ను భాస్కర్, రాజేందర్, మురళీ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు బొకే అందిస్తున్న యూనియన్ సభ్యులు

'ప్రజా పంపిణీ వ్యవస్థలో మార్పులు తేవాలి'



న్యూఢిల్లీలోని కృషి భవన్‌లో ఉన్నతాధికారులతో సుదర్శన్

ఖిలావరంగల్, ఆగస్టు 23 : జాతీయ వినియోగదారుల చట్టంలో మార్పులు తీసుకువస్తేనే ప్రజా పంపిణీ వ్యవస్థలో వేల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఉంటుందని వినియోగదారుల చట్టం తెలంగాణ రాష్ట్ర సమాఖ్య అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ అన్నారు. న్యూఢిల్లీలోని భారత ప్రభుత్వ ఆహార భద్రత, వినియోగదారులు సెక్రెటరియేట్ (కృషి భవన్)లో శుక్రవారం జరిగిన సమావేశంలో సుదర్శన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినియోగదారుల వ్యవహారాల అడిషనల్ సెక్రెటరీ అనుపం మిశ్రా, డిప్యూటీ సెక్రెటరీ అనిల్ మిశ్రా, జాతీయ వినియోగదారుల సమాఖ్య చైర్మన్ విఖ్యాత్ వి శెనాయ్‌లకు వినతి పత్రాలు అందించి ప్రజా పంపిణీ వ్యవస్థలోని లోపాలను వివరించారు. రేషన్ షాపుల్లోని రూపాయికి కిలో బియ్యం పెద్ద ఎత్తున రైస్ మిల్లర్లకు తరలి వెళ్తుందని, డీలర్లు రూ.10 కి వినియోగదారుల వద్ద కొనుగోలు చేసి రైస్ మిల్లర్లకు తరలించుతున్నారని వాటిని రీసైక్లింగ్ చేసి సన్న బియ్యంగా మార్చి రూ.60కిలో చొప్పున మార్కెట్‌లో అమ్ముకుంటున్నారన్నారని తెలిపారు. ప్రభుత్వం రేషన్ షాపుల్లో సరుకుల బదులుగా తెల్ల రేషన్ కార్డుదారులకు నగదు బదిలీ చేయాలని కోరారు.

విష జ్వరంతో విద్యార్థి మృతి



నిత్యశ్రీ (ఫైల్)

గీసుగొండ, ఆగస్టు 23: మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో విషజ్వరంతో దూల నిత్యశ్రీ(9) విషజ్వరంతో శుక్రవారం మృతిచెందింది. కుటుంబీకుల కథనం ప్రకారం విశ్వనాథపురానికి చెందిన దూల మహేందర్, శ్రీలత దంపతుల కుమార్తె నిత్యశ్రీ వరంగల్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. కాగా ఈనెల 20న నిత్యశ్రీ కి జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానిక వైద్యుడికి చూపించి మందులు వాడారు. దీంతో జ్వరం తగ్గింది. బుధవారం తెల్లవారు జామున పాపకు వాంతులు, విరేచనాలు కావటంతో వెంటనే హన్మకొండలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది. పాపకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినట్లు వైద్యులు చెప్పినట్లు తల్లిదండ్రులు విలపించారు.

అధ్వానంగా రోడ్డు

ఎక్కడికక్కడే గుంతలు

ప్రమాదకరంగా కాశిబుగ్గ-ఏనుమాముల మార్కెట్ రోడ్డు



కాశిబుగ్గ నుంచి ఏనుమాముల మార్కెట్ వెళ్లేరోడ్డులో సాగర్ హోటల్ జంక్షన్‌లో ..

వరంగల్ సిటీ, ఆగస్టు 23: నగరంలో ప్రధానమైన రోడ్లలో కాశిబుగ్గ-ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ రోడ్డు ఒకటి. కాశిబుగ్గ నుంచి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌తోపాటు చాలా గ్రామాలకు లింక్ రోడ్డుగా ఉంది. మార్కెట్‌కు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రైతులు పండించిన పంట సరుకులను అమ్మకానికి తీసుకువస్తారు. ఇంతటి ప్రాధాన్యమున్న మార్కెట్ రోడ్డు కాస్తా గుంతలమయంగా మారింది. మార్కెట్ రోడ్డును 2008 సుమారు ఆరున్నర కోట్లతో మార్కెట్ కమిటీ నిధులతో నిర్మించారు.

వాహనాలు పాడైపోతున్నాయి

మార్కెట్ రోడ్డు ఎక్కడికక్కడే ధ్వంసం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలాచోట్ల ఫీటు లోతు వరకు గుంతలు పడ్డాయి. ఒక గుంత దాటగానే మరోగుంత ఉండడంతో ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటేనే జంకుతున్నారు.



మార్కెట్ వెళ్లే రోడ్డులో గ్రంథాలయం సమీపంలో గుంతలు పడిన రోడ్డు



శ్రీ కాశీవిశ్వేశ్వరాలయం సమీపంలో ...



ఈ రోడ్డును ఎవరు పట్టించుకోవడం లేదు

- ఎండి సలీం, ఆటో యూనియన్ మాజీ అధ్యక్షుడు(మార్కెట్ అడ్డా)

మార్కెట్ రోడ్డు మరీ అధ్వానంగా మారింది. రోడ్డుపై చాలాచోట్ల గుంతలుపడినా ఎవరూ పట్టించుకోవడం లేదు. మార్కెట్ కమిటీ కమిటీ పరిధిలోని పనులకు మాత్రమే నిధులు వెచ్చిస్తుండడంతో ఈ రోడ్డు అధికారులకు పట్టడం లేదు.

మేయర్ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా 30న ప్రజాధర్నా

40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ మరుపల్ల రవి

కరీమాబాద్, ఆగస్టు 23: వరంగల్ మహానగర పాలకసంస్థ మేయర్ గుండు సుధారాణి నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈనెల 30న మహానగర పాలకసంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. శుక్రవారం ఉర్సు ప్రతాప్‌నగర్‌లోని డివిజన్ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40వ డివిజన్ అభివృద్ధి కుంటుపడిందని, ఈ డివిజన్‌లో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్డు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ సౌకర్యం, కనీస మౌలిక వసతులు సమకూర్చకపోవడంతో డివిజన్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నిసార్లూ మేయర్ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని, టౌన్ ప్లానింగ్ అధికారులు డ్రైనేజీ నిర్మాణానికి మార్కింగ్ ఇవ్వని కారణంగా ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మురుగునీరు శ్మశాన వాటికల్లో, కాలనీల్లో ప్రవహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం 60ఫీట్ల రోడ్డు నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రద్ధ చూపడం లేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్, కార్యదర్శి వనం కుమార్, నాయకులు మరుపల్ల గౌతమ్, సాదుల రంజిత్, శెట్టి మోహన్, గజ్జి సాంబయ్య వెంకటేశ్వర్లు, రమేష్, చంద్రకళ, వహీదా పాల్గొన్నారు.

క్యాంటీన్ పనులు త్వరగా పూర్తి చేయండి

క్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని



వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 23 : బల్దియా ప్రధాన కార్యాలయంలో పునఃనిర్మాణం జరుగుతున్న క్యాంటీన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శుక్ర వారం బల్దియా ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న క్యాంటీన్ పనులను పరిశీలించారు. క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. పేయింటింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్వో కోల రాజేశ్‌కుమార్, డీఈ రవికి రణ్, సీఎంసీ రమేష్, ఏఈ శ్రీనివాస్, సీవో రజిత, వర్క్‌ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

రైలులోంచి పడి ప్రయాణికుడి మృతి



మృతి చెందిన ప్రయాణికుడు

గిర్మాజిపేట, ఆగస్టు 23: ప్రమాదశాత్తు రైలులోంచి పడి ప్రయాణికుడు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ ఎండీ మోహినిద్దీన్ కథనం ప్రకారం. సికింద్రాబాద్ నుంచి చెన్నై వెళ్తున్న చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో గుర్తు తెలియని వ్యక్తి (35) గురువారం రాత్రి చింతలపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. మృతుడు 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు, బ్లాక్ కలర్ ప్యాంటు, వంకాయ రంగు కలర్ టీ షర్టు ధరించి ఉన్నాడు. కుడి పక్కటెముకపై పుట్టుమచ్చ ఉంది. మృతుడు ముస్లింగా అనుమానిస్తున్నారు. సంబంధీకులు 98661 67291, 87126 85858 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

వరంగల్ జీఆర్పీ సీఐగా సురేందర్



నూతన సీఐ సురేందర్, బదిలీపై వెళ్తున్న సీఐ నరేష్

గిర్మాజిపేట, ఆగస్టు 23: వరంగల్ ప్రభుత్వ రైల్వే పోలీసు స్టేషన్ సీఐగా పి.సురేందర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత సీఐ జి.నరేష్‌కుమార్ జీఆర్పీలో సర్వీస్ కాలం ముగియడంతో ఆయనను ఐజీకి రిపోర్టు చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈయన స్థానంలో నిర్మల్ సీసీఎస్ సీఐగా పని చేస్తున్న సురేందర్‌ను వరంగల్ జీఆర్పీ సీఐగా బదిలీ చేశారు. అలాగే జీఆర్పీ ఎస్ఐ ఎం.ఐలయ్య సర్వీసు జీఆర్పీలో ముగియడంతో ఆయనను వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు బదిలీ చేశారు. ఈయన స్థానంలో ఎండీ మొయినోద్దీన్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. నూతన సీఐ సురేందర్, ఎస్ఐ ఎండీ మొయినొద్దీన్‌లకు ఆత్మీయ స్వాగతం, బదిలీ అయిన సీఐ నరేష్‌కుమార్, ఎస్ఐ ఐలయ్యలకు వరంగల్ జీఆర్పీ సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు.

ప్రయాణికుడిని కాపాడిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్



ప్రయాణికుడిని కాపాడుతున్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్



గిర్మాజిపేట, ఆగస్టు 23 : కదులుతున్న రైలు ఎక్కబోతు రైలు కింద పడబోయిన యువకుడిని ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ రక్షించిన ఘటన గురువారం రాత్రి వరంగల్ రైల్వే స్టేషన్‌లో జరిగింది. వరంగల్ ఆర్పీఎఫ్ సీఐ టీఎస్ఆర్ కృష్ణ శుక్రవారం విలేకరుల సమావేశంలో ఘటన వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా చిట్వాడ మండలం వీరమట్టకు చెందిన అన్నం నాయుడు (35) వరంగల్‌లో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. సొంతూరు వెళ్లేందుకు జనరల్ టికెట్ తీసుకున్న నాయుడు గురువారం రాత్రి మహబూబ్‌నగర్ నుంచి విశాఖపట్టణం వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఎస్-5 రిజర్వేషన్ కోచ్ ఎక్కేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో రైలు కదిలింది. దీంతో పట్టు తప్పి రైలు కింద పడబోయాడు. అదే సమయంలో ప్లాట్‌ఫారంపై విధుల్లో ఉన్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఎస్.మోహన్ పరుగెత్తుకు వెళ్లి నాయుడును ప్లాట్ ఫారంపైకి లాగడంతో ప్రమాదం తప్పింది. ప్రయాణికులు పెద్దగా అరవడంతో లోకోపైలెట్ రైలును నిలిపివేశారు. అనంతరం నాయుడును ఆర్పీఎఫ్ ఠానాకు తలించి, ఎస్ఐ వెంకటేశ్ అతడికి ధైర్యం చెప్పి తర్వాత మరో రైలు ఎక్కించి పంపించారు. ప్రయాణికుడిని రక్షించిన కానిస్టేబుల్ మోహన్‌ను సీఐ కృష్ణ, ఎస్ఐ వెంకటేశ్, సిబ్బంది అభినందించారు.

రైతులందరికీ రుణమాఫీని వర్తింపజేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సంగెం, ఆగస్టు 23: రైతులందరికీ రుణమాఫీని వర్తింపజేయాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ.ఇస్మాయిల్ అన్నారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టి రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రుణమాఫీ కాక బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారని, ప్రభుత్వం వెంటనే వ్యవసాయం చేస్తున్న రైతులందరికీ రూ.2లక్షలు బ్యాంకు ఖాతాల్లో వేయాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం మండల కన్వీనర్ గోనె రాంచందర్, రౌతు శ్రీనివాస్, ఎనబోతుల సాంబయ్య, మండల ఐలయ్య, జక్కా అశోక్, సంపత్, దూడయ్య, పరశురాములు, సోమిరెడ్డి, రవి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు సిగ్గులేకుండా వ్యవహరిస్తున్నారు

గీసుగొండ, ఆగస్టు 23: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేస్తే బీఆర్ఎస్ నాయకులు సిగ్గులేకుండా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం గీసుగొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల వివరాలను కూడా అధికారులతో ప్రభుత్వం సేకరిస్తుందన్నారు. అర్హులందరికీ రుణమాఫీ కోసం బడ్జెట్‌లో రూ.32వేల కోట్లను ప్రభుత్వం కేటాయించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

ఓటరు నమోదు ఇంటింటి సర్వే చేపట్టాలి

గీసుగొండ, ఆగస్టు 23: బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేపట్టి 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని తహసీల్దార్ రియాజుద్దీన్ కోరారు. శుక్రవారం ఓటరు నమోదుపై సూపర్‌వైజర్‌లకు ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 29 వరకు ఓటర్ ముసాయిదా జాబితాను విడుదల చేయాలన్నారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే నవంబరు 28 వరకు స్వీకరించి డిసెంబరు 24 వరకు పరిష్కరిస్తారని చెప్పారు. 2025 జనవరి 6న తుది ఓటర్ జాబితాను రూపొందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీటీ రవిందర్, ఆర్ఐ సాంబయ్య, బూత్‌లేవల్ అధికారులు పాల్గొన్నారు.

కొండా దంపతుల చిత్రపటానికి క్షీరాభిషేకం



కొండా దంపతుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎల్‌వీఆర్ కాలనీ వాసులు

గిర్మాజిపేట, ఆగస్టు 23 : వరంగల్ నగరంల 27వ డివిజన్ పరిధిలోని ఎల్‌వీఆర్ కాలనీలో 220 కుటుంబాలకు వ్యక్తిగత విద్యుత్ మీటర్లు మంజూరు చేయించిన మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ఫ్లెక్సీలకు శుక్రవారం కాలనీవాసులు క్షీరాభిషేకం చేశారు. ఎల్‌వీఆర్ కాలనీవాసులు చెలకల రాజు, శైలజ, పద్మలు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా కాలనీలో వ్యక్తిగత విద్యుత్ మీటర్లు లేకపోవడంతో విద్యుత్ బిల్లు కట్టడం భారంగా మారిందన్నారు. విషయాన్ని కొండా దంపతుల దృష్టికి తీసుకువెళ్లడంతో కాలనీలోని 220 కుటుంబాలకు వ్యక్తిగత విద్యుత్ మీటర్లు మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో ఎల్‌విఆర్ కాలనీవాసులు ఈశ్వరమ్మ, ఈశ్వర, అంజమ్మ, వెంకట్రాజం, లక్ష్మి, అనసూయ, శ్రీకాంత్, సుగుణమ్మ, సమ్మక్క, రాధమ్మ, జయమ్మ, హాజీ పాల్గొన్నారు.

ఆహార నిల్వలు ఉంచొద్దు..



ఆహార ప్యాకెట్లను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి

శంభునిపేట, ఆగస్టు 23 : అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు ఇవ్వాల్సిన ఆహార పదార్థాలను నిల్వ చేయొద్దని, వెంటనే పంపిణీ చేయాలని ఐసీడీఎస్ వరంగల్ ప్రాజెక్ట్ ఉర్సు సెక్టార్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి సూచించారు. శుక్రవారం ఉర్సు బొడ్రాయి హరిజనవాడ ప్రాంతాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్లు, బాలామృతం, పాలు, స్నాక్స్, ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం అమ్మ పేరు మీద ఒక మొక్క నాటడం కార్యక్రమంలో భాగంగా హరిజనవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కను నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మమత, సుజాత, స్వర్ణలత, ఆయాలు పరిపూర్ణ, వాణి, సుజాత, పుష్ప పాల్గొన్నారు.

బాధితుడికి మంత్రి సాయం



బాధితుడి కుటుంబానికి ఎల్‌ఓసీ అందిస్తున్న నాయకులు

ఖిలావరంగల్, ఆగస్టు 23 : శివనగర్‌లోని భూపేష్‌నగర్ ప్రాంతానికి చెందిన భాషపాక విల్సన్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా, మెరుగైన వైద్యం కొరకు నిమ్స్‌కు తరలించారు. విల్సన్ ఆర్థిక ఇబ్బందిని తెలుసుకున్న మంత్రి కొండా సురేఖ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.45వేల ఎల్‌ఓసీని అందించారు. శుక్రవారం విల్సన్ భార్యకు కాంగ్రెస్ నాయకులు శ్రీరాం రాజేష్, పగడాల సతీష్‌లు ఎల్‌ఓసీని అందించారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలని నిరసన



శివనగర్ పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఖిలావరంగల్, ఆగస్టు 23 : తెలంగాణ ప్రభుత్వం 2014లో అక్రమంగా తీసుకువచ్చిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్)ను రద్దు చేయాలని ఉపాధ్యాయ వర్గాలు నిరసనకు దిగారు. శుక్రవారం శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సీపీఎస్‌ను వ్యతిరేకిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నామోజు శ్రీనివాస్, పాక వినయ్ కుమార్, టీసీపీఎస్‌ఈయూ బాధ్యులు ఎమ్డీ ఖలీల్, డి తిరుపతి, ఎస్.లక్ష్మీనారాయణ, టి.దేవరాజు, సీహెచ్ సంపత్, పి.రంగాచారి, ఎస్.కవిత, సత్యనారాయణ, కాంతి రేఖ, కిరణ్మయి పాల్గొన్నారు.

శ్రీనివాస్‌ను కలిసిన యువజన సంఘం



శామంతుల శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఖిలావరంగల్, ఆగస్టు 23 : జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ చైర్మన్‌గా శివనగర్‌కు చెందిన శామంతుల శ్రీనివాస్ ఇటీవల నియమితులవగా, శుక్రవారం శివనగర్‌లోని పద్మశాలి సేవా సంఘం, యువజన సంఘం బాధ్యులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు బుదారపు భాస్కర్, ప్రధాన కార్యదర్శి ఆడెపు శ్యామ్, కోశాధికారి మాచర్ల కిషన్, చింతల సోమేశ్వర్, కుడికాల మనోహర్, సుధాకర్, సింగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

అబ్జర్వేషన్ హోంకు మైనర్లు

మట్టెవాడ, ఆగస్టు 23: వరంగల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో 12 మంది బాలురు డ్రైవింగ్ చేస్తుండగా ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం మైనర్లపై జువెనైల్ కోర్టులో చార్జ్‌షీట్ ఫైల్ చేయగా, ఒక బాలుడికి రూ.600 జరిమానా, 11 మందికి ఒక రోజు అబ్జర్వేషన్ హోంకు తరలించాలని జువైనల్ కోర్టు ఆదేశించడంతో శుక్రవారం హోంకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

శంభునిపేట, ఆగస్టు 23 : ఖిలావరంగల్ పెట్రోలు పంపు వద్ద నిర్మిస్తున్న శివశక్తి వినాయక మందిరం నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించాలని ఆలయ కమిటీ శుక్రవారం బీజేపీ నాయకులు కర్నె రవీందర్‌ను విశ్వనాథకాలనీలో కలిసింది. స్పందించిన రవీందర్ రూ.10వేలు ఆర్థికసాయం అందించారు.

కల్తీలేని ఆహార పదార్థాలను వాడాలి



హాస్టల్‌లో బియ్యాన్ని పరిశీలిస్తున్న సంధ్యారాణి

గీసుగొండ, ఆగస్టు 23: విద్యార్థులకు అందించే భోజనంలో ఆహార పదార్థాల్లో కల్తీలేనివి వాడాలని సివిల్ సప్లై జిల్లా మేనేజర్ సంధ్యారాణి అన్నారు. గీసుగొండలోని బీసీ బాలుర హాస్టల్, అంగన్‌వాడీ సెంటర్‌లను, ప్రాథమిక పాఠశాలలను ఆమె శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. బియ్యం, వంటనూనె వంటి ఆహార పదార్థాలను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అర్జున్, అంగన్‌వాడీ టీచర్‌లు నిర్మల, అరుణ, హెచ్‌ఎంలు పట్టాభి, రవిందర్ పాల్గొన్నారు.



వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

వర్ధన్నపేట, ఆగస్టు 23: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని వర్ధన్నపేట ప్రధానోపాధ్యాయుడు పి.రమణారావు అన్నారు. శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని వర్ధన్నపేట పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో విజ్ఞాన శాస్త్రానిదే పెద్దపీట అని అన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమ చుట్టూ ఉన్న మూఢ విశ్వాసాలను వీడి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనుజేందర్‌రెడ్డి, కల్యాణి, అనిల్‌కుమార్, వాణి, అశోక్, కుమారస్వామి, రజనీ, ప్రియదర్శిని, దేవయ్య, రాజేశ్వర్‌రావు, లలిత్‌కుమార్, సునిత, నర్సింగరావు, కుమారస్వామి, జయాంజలి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిర మహిళా శక్తిలో ప్రతిభ చాటాలి



మహిళలతో మాట్లాడుతున్న డీపీఎం దయాకర్

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 23 : ఇందిర మహిళా శక్తిలో ప్రతిభను చాటాలని డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మునిగాల దయాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇల్లంద గ్రామంలో కావేరి గ్రామైక్య సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహిళాశక్తి మొబైల్ క్యాంటీన్ సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మొబైల్ క్యాంటీన్‌కు అవసరమైన పెట్టుబడిని సమకూరుస్తామని, మహిళలు జిల్లాలోనే ఆదర్శంగా నిలవాలని అన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ హెచ్ఆర్ ఏపీఎం ధర్మేందర్, సీసీ కొమురయ్య, వీవో ప్రతినిధులు స్వప్న, మాధవి, వీవోఏలు రమ్య, శోభ, స్రవంతి, రమ, శ్రీమణికంఠ స్వయం సహాయక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

▸▸ డీఆర్‌డీఏ పీడీ కౌసల్యాదేవి



మాట్లాడుతున్న పీడీ కౌసల్యాదేవి

వర్ధన్నపేట, ఆగస్టు 23: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను గ్రామాల్లో పారదర్శకంగా నాణ్యతతో చేపడుతూ కూలీలకు పనులు కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ కౌసల్యాదేవి అన్నారు. శుక్రవారం వర్ధన్నపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో చేపడుతున్న పనులు నాణ్యతతో గ్రామానికి ఉపయోగడేలా ఉండాలన్నారు. హరితహారం కింద చేపట్టిన పనుల్లో మొక్కలు ఎండిపోవడంతో పీడీ ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, టీఏలు, ఈసీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ రూపాయి ప్రజల సొమ్ము అని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మొక్కలకు కలుపు తీయకపోవడం, పండ్ల తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సోషల్ ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీలు, క్షేత్ర సహాయకులు, టీఏలు, ఏపీవో, ఈసీ సంకెన రాజు తదితరులు పాల్గొన్నారు.

కల్తీలేని ఆహార పదార్థాలను వాడాలి



హాస్టల్‌లో బియ్యాన్ని పరిశీలిస్తున్న సంధ్యారాణి

గీసుగొండ, ఆగస్టు 23: విద్యార్థులకు అందించే భోజనంలో ఆహార పదార్థాల్లో కల్తీ లేనివి వాడాలని సివిల్ సప్లై జిల్లా మేనేజర్ సంధ్యారాణి అన్నారు. గీసుగొండలోని బీసీ బాలుర హాస్టల్, అంగన్‌వాడీ సెంటర్‌లను, ప్రాథమిక పాఠశాలలను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. బియ్యం, వంటనూనె వంటి పదార్థాలను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అర్జున్, అంగన్‌వాడీ టీచర్లునిర్మల, అరుణ, హెచ్ఎంలు పట్టాభి, రవిందర్ పాల్గొన్నారు.

గోదాముల నిర్మాణంతో రైతులకు మేలు

▸▸ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



ఇటుకాలపల్లిలో గోదామును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట టౌన్, ఆగస్టు 23: రాష్ట్ర ప్రభుత్వం రైతాంగం సంక్షేమం కోసం చేపడుతున్న గోదాముల నిర్మాణాల వల్ల వారికి ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నాబార్డు సహకారంతో వరంగల్ డీసీసీబీ ఆధ్వర్యంలో నర్సంపేట మండలంలోని కమ్మపల్లి, ఇటుకాలపల్లిలో 300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములను ఎమ్మెల్యే మాధవరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం నర్సంపేట పీఏసీఎస్ కార్యాలయంలో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాట్లాడుతూ గోదాముల వల్ల రైతులకు సకాలంలో ఎరువుల బస్తాలు అందించడంతో పాటు ధాన్యం నిలువ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎం.నీరజ, ఆడిట్ ఆఫీసర్ మనోహర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ తోట శ్రీనివాస్, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, డీసీసీ అధికార ప్రతినిధి తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, సొసైటీ చైర్మన్ బొబ్బాల రమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నెక్కొండ : నెక్కొండకు చెందిన రిటైర్డు టీచర్ దొడ్డ శ్రీహరి అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుమారుడు, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ దొడ్డ విజయ్‌ను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల నెక్కొండకు చెందిన ఇండ్ల కొమురమ్మ, బైరు ఆగయ్యలు మృతి చెందగా ఆయా కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే సీనియర్ పాత్రికేయుడు సాంబయ్య అనారోగ్యానికి గురై ఇంటివద్ద చికిత్స తీసుకుంటుండగా ఆయన ఆరోగ్య విషయాలను తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి ప్రభుత్వం నుంచి సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నర్సంపేట టీపీసీసీ మెంబర్ సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, హరిప్రసాద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్, నాయకులు శ్రీపాల్‌రెడ్డి, పాపిరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి సర్వాయి పాపన్నగౌడ్

▸▸ మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్‌గౌడ్

నర్సంపేట, ఆగస్టు 23: పేదల పెన్నిధి, దళిత బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని సర్వాపురంలో శుక్రవారం రేణుక ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో మోకుదెబ్బ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీకి సమకాలీకుడు, తొలి విప్లవవీరుడు పాపన్న అని కొనియాడారు. 12మంది స్నేహితులతో 12వేల మంది సైన్యాన్ని తయారు చేసి 12 కోటలను జయించిన వీరుడు పాపన్న అన్నారు.ఈనెల 25న నర్సంపేటలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్, నాయకులు మచ్చిక రాజు, శీలం వీరన్న, మద్దెల సాంబయ్య, ఉపాధ్యక్షులు జూలూరి హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె మల్లేశం, డివిజన్ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాంపల్లి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు గండి గిరిధర్ పాల్గొన్నారు.



సర్వాపురంలో మాట్లాడుతున్న అనంతుల రమేశ్‌గౌడ్

ఓటరు నమోదు కోసం సర్వే చేపట్టాలి

గీసుగొండ, ఆగస్టు 23: బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేపట్టి 18ఏళ్లు నిండిన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని తహసీల్దార్ రియాజుద్దీన్ కోరారు. శుక్రవారం ఓటరు నమోదుపై సూపర్‌వైజర్లకు ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 29 వరకు ఓటరు ముసాయిదా జాబితాను విడుదల చేయాలన్నారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే నవంబరు 28 వరకు స్వీకరించి డిసెంబరు 24 వరకు పరిష్కరిస్తారని చెప్పారు. 2025 జనవరి 6న తుది ఓటరు జాబితాను రూపొందిస్తామన్నారు. ఈ సమావేశంలో డీటీ రవీందర్, ఆర్ఐ సాంబయ్య, బూత్‌లేవల్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ఐ జోన్ సెక్రటరీ రాందాసుకు సన్మానం

దుగ్గొండి, ఆగస్టు23: మండలంలోని మహ్మదాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాయామ, విద్య ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న చెన్నబోయిన రాందాసు ఎస్‌జీఎఫ్ఐ నల్లబెల్లి, దుగ్గొండి, మండలాల జోన్ సెక్రటరీగా ఎంపిక కాగా శుక్రవారం ఘనంగా సన్మానం చేశారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్ఎం రామస్వామి ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయుల సమక్షంలో ఎస్‌జీఎఫ్ఐ జోన్ సెక్రటరీగా నియమించబడిన రాందాసును సన్మానించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రవీందర్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

రాయపర్తి, ఆగస్టు 23: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో గల సెయింట్ మేరీ హైస్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణ-గోపికల వేషధారణలతో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వెంకట్ రెడ్డి, రమేష్, రవీనా-రాజు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి కాదు.. ఇష్టపడి చదవాలి

వర్ధన్నపేట, ఆగస్టు 23: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని ప్రముఖ స్టూడెంట్ కౌన్సిలర్, అభ్యుద రచయితల సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గూడ భిక్షపతి అన్నారు. శుక్రవారం వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాస కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు లక్ష్యం అంటే ఏమిటి? దానిని చేరుకునే విధానం, ఎప్పుడు చదవాలి? ఎలా చదవాలి? ఎందుకు చదవాలి? అనే విషయాల పట్ల పూర్తిగా అవగాహన కల్పించారు. గత మార్చిలో జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 470 మార్కులకు 377 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచిన రాంచరణ్‌తేజ, పలు గ్రూపుల్లో ఎం.అర్చన, సాగర్, ఎండీ.అజీరసుల్తానా తదితరులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటయ్య, అధ్యాపకులు రాజేంద్రప్రసాద్, రాజ్‌కుమార్, శోభారాణి, స్వరూప, షమీనా, వేణుమాధవి, అధ్యాపకేతర సిబ్బంది రజిత, అనిల్‌కుమార్, వనమాల, రమ, ఇద్దమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

▸▸ డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాష్



కోనాపురంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాష్

చెన్నారావుపేట, ఆగస్టు 23: గ్రామాల్లోని ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఐ.ప్రకాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని కోనాపురం గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరాలు రాగానే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న వారు వైద్యుల సలహాలను తీసుకోవాలని సూచించారు. అలాగు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శిబిరంలో 213 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాజునాయక్, అఫ్రిన్,వాసవి, రాజన్న, జ్యోత్స్న, జయరాజు, ప్రముఖ దంత వైద్యులు మట్ట భారత్‌రెడ్డి, వాసవి, మహేందర్‌రెడ్డి, తండ విజయ్‌కుమార్, యమున, అక్షిత, సహజ, భవాని, సునీల్, జయరాజు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి

నెక్కొండ: వృద్ధులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, వృద్ధాప్యంలో అనారోగ్యంకు గురైతే అనేక రకాల ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆయూష్ ఆయుర్వేదిక్ జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ షైదం రాజు అన్నారు. మండలంలోని గుండ్రపల్లి గ్రామంలో శుక్రవారం వృద్ధులకు ఉచిత ఆయుర్వేదిక్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదిక్ ఔషధాలు(మందులు) వాడటంతో ఎలాంటి ఇబ్బందులు కలగవన్నారు. వృద్ధులకు రకరకాల పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ అనిత, డాక్టర్ వి.రాజు, డీపీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

▸▸ జడ్పీ సీఈవో రాంరెడ్డి



నారాయణపురంలో డ్రై డేలో పాల్గొన్న జడ్పీ సీఈవో రాంరెడ్డి

పర్వతగిరి, ఆగస్టు 23: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జడ్పీ సీఈవో రాంరెడ్డి అన్నారు. మండలంలోని నారాయణపురంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఫ్రైడే-డ్రైడే నిర్వహణను పరిశీలించి ప్రజలకు సూచనలు చేశారు. పాత కూలర్లు, వాడిపడేసిన కొబ్బరి చిప్పలు, పాత ప్లాస్టిక్ డ్రమ్ములు, కుండలు, గోళాలు, పాత టైర్లు తదితర వాటిలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా పారబోయాలని అన్నారు. డ్రెయినేజీల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. వర్షపు నీరు, మురుగు నీరు పేరుకుపోతే దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ హారతి, డాక్టర్ రమాదేవి, ఈసీ రాజు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై జడ్పీ సీఈవో అసహనం

దుగ్గొండి: పారిశుధ్యంపై జడ్పీ సీఈవో, ఇన్‌చార్జ్ డీపీవో రాంరెడ్డి అసహనం వ్యక్తం చేసి మురికి నీటిలో గ్రామ పంచాయతీ సిబ్బందిచే ఆయిల్ బాల్స్ వేయించారు. మండలంలోని నాచినపల్లి గ్రామాన్ని శుక్రవారం ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో శ్రీధర్‌గౌడ్‌తో సందర్శించగా పోచమ్మ దేవాలయం దగ్గర మురికినీరు నిలిచిపోయి గడ్డి, చెత్తాచెదారంతో ఉండిపోయింది. చేతిపంపు సైతం మురికి నీటిలోనే ఉంది. దీంతో రాంరెడ్డి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి మురికి నీటిలో ఆయిల్ బాల్స్‌ను వేయించి దోమలు, ఈగల నివారణ చర్యలు చేపట్టారు. అదేవిధంగా గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి జ్వరాలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మలేరియా తదితర జ్వరాలు వస్తున్నందున ప్రజలను చైతన్య పర్చాలన్నారు. స్థానిక డాక్టర్ అహ్మద్‌కు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు తగు సూచనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆనంద్, జీపీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలల వికాసం కోసమే అంగన్‌వాడీ సెంటర్లు

చెన్నారావుపేట, ఆగస్టు 23: బాలల వికాసం కోసమే అంగన్‌వాడీ సెంటర్లు పని చేస్తున్నాయని నర్సంపేట సీడీపీవో మధురిమ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నెక్కొండ, చెన్నారావుపేట మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల బరువును తూచి తల్లులకు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ప్రీ ప్రైమరీ స్కూల్స్‌లను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సమావేశంలో ఏసీడీపీవో హేమలత, ఎంపీడీవో శ్రీవాణి, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్‌గా తిరుపతిరెడ్డి

నెక్కొండ, ఆగస్టు 23: కాంగ్రెస్‌పార్టీ సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా నెక్కొండకు చెందిన రావుల తిరుపతిరెడ్డిని నియమించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ శుక్రవారం తెలిపారు. తిరుపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేస్తుండడంతో కన్వీనర్‌గా నియమించామన్నారు.

విద్యార్థుల స్థాయిని గుర్తించి బోధన చేయాలి

నెక్కొండ, ఆగస్టు 23 : విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని మండల నోడల్ ఆఫీసర్ రవికుమార్ సూచించారు. మండలంలోని చిన్నకొర్పోలు, సూరుపల్లి పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను నిరంతరం గమనించడంతో ఉత్తమ ఫలితాలను సాధించగలుగుతారన్నారు. ప్రతి వారం విద్యాశాఖ జారీ చేసిన షెడ్యూల్‌కు అనుగుణంగా బేస్‌లైన్ టెస్టులు నిర్వహించి సమాధాన పత్రాలు మూల్యాంకనంచేయాలని సూచించారు. సీఆర్పీ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజకీయ మనుగడ కోసమే రైతుధర్నా

▸▸ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి



రాయపర్తిలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

రాయపర్తి, ఆగస్టు 23: బీఆర్ఎస్ పార్టీ రాజకీయ మనుగడ కోసమే రైతుధర్నా చేపట్టిందని, ఎర్రబెల్లి తన ఉనికిని కాపాడుకోవడం కోసమే ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి అన్నారు. స్థానికంగా శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులెవ్వరూ బీఆర్ఎస్ మాయమాటలు విని మోసపోకూడదన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.లక్ష రుణాన్ని సైతం మాఫీ చేయలేదని తెలిపారు. రైతులు అధైర్యపడవద్దని, అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణమాఫీ జరిగి తీరుతుందన్నారు. సమావేశంలో పాలకుర్తి ఆలయ చైర్మన్ క్రిష్ణమాచార్యులు, డైరెక్టర్ పెండ్లి మహేందర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు భూక్యా సమ్మయ్య, కిసాన్ సెల్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిర్ర మల్లయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు మచ్చ కుమారస్వామి, గబ్బెట బాబు, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

సంగెం: రైతులందరికీ రుణమాఫీని వర్తింపజేయాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ.ఇస్మాయిల్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టి రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రుణమాఫీ కాక బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారని, ప్రభుత్వం వెంటనే వ్యవసాయం చేస్తున్న రైతులందరికీ రూ.2 లక్షలు బ్యాంకు ఖాతాల్లో వేయాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం మండల కన్వీనర్ గోనె రాంచందర్, రైతు శ్రీనివాస్, ఎనబోతుల సాంబయ్య మండల ఐలయ్య, జక్కా అశోక్, సంపత్, దూడయ్య, పరశురాములు, సోమిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

సిగ్గులేకుండా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ నేతలు

గీసుగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేస్తే బీఆర్ఎస్ నాయకులు సిగ్గులేకుండా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం గీసుగొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల వివరాలను కూడా అధికారులతో ప్రభుత్వం సేకరిస్తుందన్నారు. అర్హులందరికీ రుణమాఫీ కోసం బడ్జెట్‌లో రూ.32వేల కోట్లను ప్రభుత్వం కేటాయించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

విషజ్వరంతో విద్యార్థి మృతి



నిత్యశ్రీ (ఫైల్)

గీసుగొండ, ఆగస్టు 23: మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో విషజ్వరంతో దూల నిత్యశ్రీ(9) విషజ్వరంతో శుక్రవారం మృతిచెందింది. కుటుంబీకుల కథనం ప్రకారం విశ్వనాథపురానికి చెందిన దూల మహేందర్, శ్రీలత దంపతుల కుమార్తె నిత్యశ్రీ వరంగల్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. కాగా ఈనెల 20న నిత్యశ్రీ కి జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానిక వైద్యుడికి చూపించి మందులు వాడారు. దీంతో జ్వరం తగ్గింది. బుధవారం తెల్లవారుజామున పాపకు వాంతులు, విరేచనాలు కావటంతో వెంటనే హన్మకొండలోని ఓప్రైవేటు హాస్పిటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. పాపకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినట్లు వైద్యులు చెప్పినట్లు తల్లిదండ్రులు విలపించారు.

హక్కులు, చట్టాలపై మహిళలకు అవగాహన

చెన్నారావుపేట, ఆగస్టు 23: సఖి సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలకు వారి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. మండలంలోని జల్లి, పాపయ్యపేట గ్రామాల్లో నిర్వహించిన సమావేశంలో సఖి సెంటర్ కెస్ వర్కర్స్ తిరుమల, స్వప్న మాట్లాడుతూ బాలికల రక్షణ, భద్రత కోసమే రాష్ట్ర ప్రభుత్వం సఖి సెంటర్లను నడిపిస్తుందన్నారు. 24గంటలు అందుబాటులోఉండి మహిళలకు హెల్ప్‌లైన్ నంబర్ 181కు కాల్‌చేస్తే సమస్యలను పరిష్కరించటం జరుగుతుందన్నారు. బాలికల చట్టాలు, బాల్య వివాహాలు. గృహహింసపై అవగాహన కల్పించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల వీవోఏలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హత్యాచారం ఘటన భరత జాతికి సిగ్గుచేటు



గొల్లపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ తీస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

నల్లబెల్లి, ఆగస్టు 23: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం ఘటన 78ఏళ్ల స్వతంత్ర భారతావనికి సిగ్గుచేటని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని గొల్లపల్లి గ్రామంలో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో వైద్యురాలిపై హత్యాచారం ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీని తీశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. భారతదేశంలో పాలకులు మహిళల కోసం ఎన్ని చట్టాలను తీసుకొస్తున్నా ఇంకా అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయన్నారు. యువత మత్తు, డ్రగ్స్‌తో పెడదారి పట్టకుండా పకడ్బందీగా చట్టాలను చేయాలన్నారు. దేశంలో ఎంతటి వారైనాసరే తప్పు చేస్తే శిక్ష పడుతుందనే భయం పుట్టాలన్నారు. వైద్యురాలిపై హత్యాచారం భారత జాతికి తలవంపుగా మారిందన్నారు. ప్రభుత్వం నేరస్తులకు చట్ట ప్రకారం కఠిన శిక్ష విధించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇట్టబోయిన రవి, ఎల్లబోయిన ఐలన్న, సలుపాల రమేష్, పొన్నం మహేష్, రాజకొమురయ్య, షైమ, స్వరూప, రాజక్క తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయిన బాధితులను ఆదుకోవాలి

వర్ధన్నపేట, ఆగస్టు 23 : రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోయిన నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేయాలని డీఎస్ఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఇళ్లను కోల్పోయిన బాధిత దళిత కుటుంబాలను శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఇచ్చిన హామీ మేరకు నిరుపేద దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కంజర్ల సమ్మయ్య, మునిగాల అరుణ్‌కుమార్, కొండేటి గట్టయ్య, తుమ్మల పుష్ప, ఎండీ.షైబెల్లి, సుగుణ పాల్గొన్నారు.

భార్యను భర్తకు అప్పగించిన సఖీకేంద్రం నిర్వాహకులు

నర్సంపేట, ఆగస్టు 23: పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళను నర్సంపేట సెక్టార్ సూపర్‌వైజర్ రమ ఆధ్వర్యంలో పోలీసుల సహకారంతో అంగన్‌వాడీ టీచర్లు వాణి, పద్మ వరంగల్‌లోని సఖి కేంద్రంలో ఈనెల 21 సాయంత్రం అప్పగించామని నర్సంపేట సఖి కేంద్రం అడ్మిన్ శ్రీలత తెలిపారు. వరంగల్ సఖి సెంటర్ నిర్వాహకులు సదరు మహిళ మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సిద్దబోయిన కృష్ణవేణి అలియాస్ పెంటక్కగా గుర్తించి శుక్రవారం భర్త అశోక్‌ను పిలిపించారు. కౌన్సిలింగ్ నిర్వహించి భర్త అశోక్‌కు భార్య కృష్ణవేణిని అప్పగించినట్లు శ్రీలత పేర్కొన్నారు.